క్లుప్తంగా

కాకయ్య ఆలయ భూమి వివాదంపై విచారణ



ఆర్మూర్: నందిపేట మండలం తల్వేద గ్రామంలో వివాదాస్పదంగా మారిన కాకయ్య ఆలయ భూమిపై ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా బుధవారం విచారణ జరిపారు. గ్రామంలోని 403/1, 403/2 సర్వే నెంబర్‌లోని ఆలయ భూమిని గడ్డం గంగారెడ్డి అనే వ్యక్తి కబ్జా చేసి రైస్ మిల్లును ఏర్పాటు చేశారని గ్రామస్తులు కొన్నేళ్లుగా ఆరోపిస్తూ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. మరో వైపు ఈ వివాదాస్పద స్థలంలో అక్రమంగా ఇంటి నెంబర్లు కూడా కేటాయించారంటూ గ్రామస్తులు ఆర్మూర్ సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఫిర్యాదుదారులతో పాటు రెవెన్యూ, మండల శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులను, దేవాదాయశాఖ కమిషనర్‌ను విచారణకు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు గ్రామస్తులు ఆర్మూర్ సబ్ కలెక్టర్ కార్యాలయానికి తరలి వచ్చారు. ఇరు వర్గాలతో మాట్లాడి సమస్య మూలాలపై సబ్ కలెక్టర్ విచారణ జరిపారు.

మెండోరా తహసీల్దార్‌గా శ్రీనివాస్‌రెడ్డి



బాల్కొండ: మెండోరా తహసీల్దార్‌గా శ్రీనివాస్ రెడ్డి బుధవారం తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. గతంలో తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన సంతోష్‌రెడ్డి బదిలీపై జిల్లా కలెక్టరెట్‌లో సూపరింటెండెంట్‌గా వెళ్లారు. నిర్మల్ అర్బన్ తహసీల్దార్ కార్యలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి పదోన్నతిపై మెండోరాకుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు తహసీల్ కార్యాలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

జీపీ నూతన భవన నిర్మాణానికి మార్కవుట్



బాల్కొండ: ముప్కాల్ మండలం నాగంపేట్ గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణం కోసం బుధవారం పంచాయతీ రాజ్ అధికారులు మార్కవుట్ చేశారు. నూతన భవనం నిర్మాణం కోసం ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 20 లక్షలు మంజూరు కాగా, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. పీఆర్ ఏఈఈ షరీఫ్, జీపీ కార్యదర్శి గౌతమి, మాజీ ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ముత్యంరెడ్డి , నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లాటరీ పద్ధతిలో డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపు



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామానికి సంబంధించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను అధికారులు లాటరీ పద్ధతిలో లబ్ధిదారులకు కేటాయించారు. ఆర్మూర్ పట్టణంలోని రైతు వేదిక భవనంలో బుధవారం సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా సమక్షంలో లాటరీ నిర్వహించారు. గ్రామంలో ఇదివరకే గుర్తించిన 92 మంది లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించారు. వృద్ధులకు గ్రౌండ్ ఫ్లోర్‌లో కేటాయిస్తూ మిగిలిన వాటిని లాటరీ పద్ధతిలో కేటాయించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుజాత, పంచాయత్‌రాజ్ ఇంజినీరింగ్ అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆర్టీసీని ఆదరించాలి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ ఆర్టీసీ అందిస్తున్న సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డిపో మేనేజర్ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దసరా, బతుకమ్మ పండుగ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం డిపో ప్రత్యేకంగా 65 బస్సులను నడపడుపుతుందన్నారు. ఈనెల 27 నుంచి అక్టోబర్ 6 వరకు సెమీ–డీలక్స్, సూపర్ లగ్జరీ, రాజధాని, లహరి ఏసీ, డీలక్స్ అండ్ నాన్ ఏసీ సర్వీసుల్లో ప్రయాణించిన ప్రయణికులకు లక్కీ డ్రా ఉంటుందన్నారు. ఇందులో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.25 వేలు, రెండోది రూ.15000, మూడోది రూ.10000 ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రయాణం ముగిసిన తర్వాత టికెట్ వెనుక పేరు, అడ్రస్, ఫోన్ నెంబర్ రాసి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన లక్కీ డ్రా బాక్స్‌లో వేయాలన్నారు. ఆర్టీసీ ప్రవేశ పెట్టిన 'యాత్రా దానం' కార్యక్రమానికి దాతలు, ఎన్ఆర్ఐలు, స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు విరాళాలు అందజేసి భాగస్వాములు కావాలని కోరారు.

అన్నపూర్ణా నమోస్తుతే..



ఆర్మూర్‌లోని హౌసింగ్‌బోర్డులో అన్నపూర్ణామాత అలంకరణలో..



రెంజల్‌లో కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

రెంజల్/రుద్రూర్/వర్ని/ఆర్మూర్‌టౌన్/బోధన్ : దసరా నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా 3వ రోజైన బుధవారం అన్నపూర్ణా దేవి అవతారంలో దుర్గా మాత భక్తులకు దర్శనమిచ్చింది. ఆకలి తీర్చే అన్నపూర్ణా నమోస్తుతే అంటూ భక్తులు మండపాల్లో కొలువైన అమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక కుంకుమార్చన, కలశపూజలు నిర్వహించారు.మండపాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పలు గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాల ను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. రుద్రూర్ మండల కేంద్రంలోని శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయం వద్ద మహిళ ఆలయ కమిటీ సభ్యులు చీరలను వేలంపాట వేశారు.శ్రీ దుర్గాదేవి 24 వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. సాలూర మండల కేంద్రంలోని సార్వజనిక్ దుర్గామాత మండపం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆర్మూర్ మండల పిప్రి గ్రామంలో దుర్గామాత మండపం వద్ద ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ ప్రత్యేక పూజలు చేశారు.



రుద్రూర్ చౌడేశ్వరి ఆలయంలో చీరల వేలం నిర్వహిస్తున్న కమిటీ ప్రతినిధులు



రుద్రూర్‌లో దుర్గామాత మండపం వద్ద కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు



పిప్రి గ్రామంలో దుర్గామాత పూజలో పాల్గొన్న ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్ రాజశేఖర్



జాకోరాలో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో ప్రభుత్వ నిర్లక్ష్యం



అంక్సాపూర్‌లో మొక్కజొన్నలు పరిశీలిస్తున్న మిట్టపల్లి మహిపాల్

వేల్పూర్: మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని బీఆర్ఎస్ రైతువిభాగం జిల్లా నాయకుడు మిట్టపల్లి మహిపాల్ ఆరోపించారు. బుధవారం ఆయన వేల్పూర్ మండల గ్రామాలలో మొక్కజొన్న పంట నూర్పిడీలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్నలకు మద్దతు ధర క్వింటాలుకు రూ. 2400 ఉండగా, దళారులు క్వింటాలుకు రూ. 1800 నుండి రూ. 1900 లకు కొనుగోలు చేస్తున్నారన్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించాలని కోరారు.



మామిడిపల్లి వద్ద ఆరోబోసిన మొక్కజొన్నలను పరిశీలిస్తున్న నూతుల శ్రీనివాస్ రెడ్డి

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

పెర్కిట్(ఆర్మూర్): ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులు దళారుల నుంచి నష్టపోకుండా ఆదుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు నూతుల శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లితో పాటు మండలంలోని గోవింద్ పేట్‌లో రోడ్లపై ఆరబోసిన మొక్కజొన్న ధాన్యాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రైతులు లింగం, ముత్యం, నర్సయ్య, భాజన్న, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో బతుకమ్మ సంబురాలు



నందిపేట: బతుకమ్మ వేడుకలో అంగన్‌వాడీ టీచర్లు

రుద్రూర్/నందిపేట్/ఆర్మూర్‌టౌన్ : ఐసీడీఎస్ ఆధ్వర్యంలో రుద్రూర్, నందిపేట మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రంలో బతుకమ్మ సంబురాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో బతుకమ్మ పాటలు పాడుతూ.. ఆడారు. అనంతరం సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు. అలాగే ఆర్మూర్ ఆర్టీసీ డిపోలో మహిళ కండక్టర్‌లు రంగురంగుల పువ్వులతో బతుకమ్మలను పేర్చి అనంతరం నిమజ్జనం చేశారు. డిపో మేనేజర్ రవికుమార్, అసిస్టెంట్ మేనేజర్ సావిత్రి మెకానికల్ ఫోర్‌మెన్ గంగాకిషన్, డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.



ఆర్టీసీ డిపోలో ..

స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ వైద్య శిబిరానికి విశేష స్పందన



కమ్మర్‌పల్లిలో మహిళలకు మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ నాగరాజు

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి, చౌట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రత్యేక వైద్య నిపుణులు గైనకాలజిస్ట్, చెవి, ముక్కు, గొంతు, కంటి, చర్మవ్యాధి నిపుణులు, పీడియాట్రిక్, మానసిక వ్యాధి నిపుణులు హాజరై మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. స్త్రీలలో వచ్చే వ్యాధులు, చికిత్స, వ్యక్తిగత శుభ్రత, ఆరోగ్య సలహాలు, సూచనలు తెలియజేశారు. డిప్యూటీ డీహెచ్ఎంవో రమేష్, నాగరాజు, వైద్యాధికారులు నరసింహాస్వామి, స్పందన, హెచ్ఈవో చింత స్వతనారాయణ, సూపర్‌వైజర్ స్వరూప, ల్యాబ్ టెక్నీషియన్ పవన్ కు మార్, రాంబాబు ఫార్మసిస్ట్ అరుణ్, ఏఎన్ఎంలు కీర్తి, దివ్య, దుర్గ, జయ, ఋషి, శ్యామల, అరుణ, విజయలక్ష్మి, శోభారాణి, సుప్రియ, గీత, ప్రసన్న, డీఈవో మధు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే రెంజల్ పీహెచ్‌సీలో వైద్యశిబిరం నిర్వహించారు. ఎస్ఎస్ఎస్‌పీపీ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాజుగౌడ్ వైద్య శిబిరాన్ని ఆకస్మికంగా సందర్శించారు. రోగులను పరీక్షించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జనరల్ ఫిజిషియన్ శ్రీకాంత్, పిల్లల వైద్య నిపుణుడు మల్లయ్య, ఫైలేరియా, క్షయ వ్యాధిగ్రస్తులకు అవసరమైన సూచనలు అందించి మందులను పంపిణీ చేశారు. నోడ ల్ అధికారి డాక్టర్ వినయ్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యురాలు ఫిర్డోస్, ఆరోగ్య విస్తీర్ణ అధికారులు రవీందర్, వెంకటేశ్వర్‌రావ్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

రైతే దేశానికి వెన్నెముక



లయన్స్ డిస్ట్రిక్ట్ 320 ఆధ్వర్యంలో ఆదర్శ రైతులను సన్మానిస్తున్న అతిథులు

బోధన్‌టౌన్(బోధన్): రైతే దేశానికి వెన్నెముక అని లయన్ పాస్ట్ ఇంటర్నేషనల్ డైరక్టర్ ఘట్టమనేని బాబురావు అన్నారు. పట్టణ శివారులోని కమ్మ సంఘంలో లయన్స్ డిస్ట్రిక్ట్ 320 ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఆదర్శ రైతు సన్మాన కార్యక్రమం బుధవారం ఫార్మర్స్ వెల్ఫేర్ సొసైటీ డిస్ట్రిక్ట్ సెక్రటరీ శివన్నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ అధికారులు స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం వివిధ లయన్స్ క్లబ్‌లు స్పాన్సర్స్‌గా వ్యవహరించి 110 మంది ఆదర్శ రైతులను ఘనంగా సన్మానించారు. రైతు కష్టం గుర్తించడం అందరి బాధ్యత అని ఘట్టమనేని బాబు రావు అన్నారు. రైతులు సాగులో నూతన వరి వంగడాల వైపు అడుగులు వేసి భవిష్యత్ తరాలకు ఆదర్శగా నిలవాలని ముఖ్య ఉపన్యాసకులు రాజేంద్ర నగర్ వ్యవసాయ యూనివర్సిటీ ప్రిన్సిపల్ డాక్టర్ దామోదర రాజు అన్నారు. అన్ని లయన్స్ క్లబ్స్ కలిసి ఆదర్శ రైతులకు సన్మానం చేయడం అభినందనీయమన్నారు. రైతులకు అన్ని వ్యవసాయ పని ముట్లు లభించేలా ప్రతి మూడు నెలలకు ఒక సారి రైతు సదస్సులు ఏర్పాటు చేస్తామని డిస్ట్రిక్ గవర్నర్ అమర్నాథ్, పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ బసవేశ్వర్‌రావు అన్నారు. సమాజంలో లయన్స్ క్లబ్ లు సమాజ శ్రేయస్సు కోసం దోహద పడుతున్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వివిధ క్లబ్‌ల ప్రతినిధులు, పాస్ట్ గవర్నర్లు, మల్టిపుల్ కో ఆర్డినేటర్స్ ప్రకాష్‌రావ్, జనార్దన్ రెడ్డి, వీరేశం, పెంటయ్య, గంధాని శ్రీనివాస్ ఉన్నారు.

నేలకొరిగిన వరి పంట



బజార్ కొత్తూర్ శివారులో నేలకొరిగిన వరిపంట

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండలంలో మంగళవారం, బుధవారం కురిసిన వర్షాలకు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈదురు గాలులకు వరిపంట నేలకొరిగింది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మండలంలోని దాదాపు వేయి ఎకరాల్లో పంట నష్టమైనట్లు తెలుస్తోంది. మండలంలోని బజార్ కొత్తూర్, మాయాపూర్, ఉమ్మెడ, బాద్గుణ, నందిపేట, తల్వేద, చింరాజ్‌పల్లి, లక్కంపల్లి, అయిలాపూర్, కంఠం గ్రామాలలో వరిపంట బాగా దెబ్బతింది. వారం రోజుల్లో పంట కోతకు వచ్చే సమయంలో వరిపైరు మోకాలు నీటి లోతులో మునిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి పైరు నేలకొరగడంతో కూలీ రేట్లు పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కుల నిర్మూలన చైతన్యం రావాలి



బోధన్‌లో మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేశ్

బోధన్: ప్రతి ఒక్కరిలో కుల నిర్మూలన చైతన్యం రావాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ సహాయ కార్యదర్శి బీ.మల్లేశ్ అన్నారు. సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతీబాపూలే కుల వ్యవస్థకు వ్యతిరేకంగా వాటి నిర్మూలన లక్ష్యంతో సత్యశోధన్ సమాజ్ స్థాపించి 152 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పార్టీ రాష్ట్ర కమిటీ కుల నిర్మూనల ప్రచార సదస్సులు నిర్వహించాలని పిలుపు నిచ్చింది. ఇందులో భాగంగా బుధవారం పట్టణ కేంద్రంలోని రాకాసీపేట ప్రాంతంలో సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ, ప్రజా సంఘాల పట్టణ ప్రతినిధులు ఇర్షద్, సీతారాం, బీపాషా బేగం, లాలయ్య, ఇంద్ర, సంధ్య, స్వరూప నాగమణి, సవిత, రేణుక తదితరులు పాల్గొన్నారు.

సత్యశోధక్ సమాజ స్థాపనకు పాటుపడుదాం

నందిపేట్/వేల్పూర్: సమానత్వం, సమాజిక న్యాయం కోసం సత్యశోధక్ సమాజ స్థాపనకు పాటుపడాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కె. గంగాధర్ పిలుపు నిచ్చారు. నందిపేటలోని మహాత్మా జ్యోతీబాపూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ స్థాపన ఏర్పాటు దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జేఏసీ నాయకులు సిలిండర్ లింగం, బాలగంగాధర్, టీయూసీఐ జిల్లా కోశాధికారి సాయరెడ్డి, సతీష్, రాకేష్, సయ్యద్, మేకలసాగర్, విశ్వనాథ్, సమీర్ తదితరులు పాల్గొన్నారు. వేల్పూర్ మండలం రామన్నపేట్ గ్రామంలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో సత్యశోధక్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యూత్ ప్రధాన కార్యదర్శి బాబూరావు, ఉపాధ్యక్షులు దిలీప్, అవినాశ్, ప్రధాన సలహాదారుడు మురళి, సుజిత్, దేవీప్రసాద్ పాల్గొన్నారు.



రామన్నపేట్‌లో జ్యోతీబాపూలే, సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

ఫుడ్ సైన్స్ విద్యార్థుల స్వచ్ఛభారత్



రుద్రూర్: మండలం కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో బుధవారం ఫుడ్ సైన్స్ కాలేజీ విద్యార్థులు స్వచ్ఛభారత్ నిర్వహించారు. జాతీయ సేవా పతకం దినోత్సవాన్ని పురస్కరించుకుని కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు, చెత్త చెదారం తొలగించారు. కాలేజీ అసోసియేట్ డీన్ వెంకట్ రెడ్డి, ప్రోగ్రాం ఇన్‌చార్జి సాయిప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్ ప్రకాష్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం



నందిపేట్ (ఆర్మూర్): మండలంలోని ఐలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జాతీయ సేవా పతకం ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ అరుగుల చిన్నయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేశం జాతీయ సేవా పథకం ఉద్దేశాలను వివరించారు.కళాశాల అధ్యాపకు లు, సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



మామిడిపల్లిలో మాట్లాడుతున్న సీడీపీవో భార్గవి

పెర్కిట్(ఆర్మూర్): ఆరోగ్యవంతమైన సంతానం కోసం గర్భిణులు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీవో భార్గవి సూచించారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన సెక్టార్ లెవెల్ పోషణ్ మహా కార్యక్రమాన్ని సీడీపీవో పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యతో పాటు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు బతుకమ్మ ఆడారు. సూపర్‌వైజర్ శ్రీదేవి, టీచర్లు జగదాంబ, తారా, ఆయాలు పాల్గొన్నారు.

పౌష్టికాహార లోపాన్ని తగ్గించాలి

నందిపేట్(ఆర్మూర్): ప్రతి ఒక్కరూ పౌష్టికాహార లోపాన్ని తగ్గించుకునేలా చూసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వేజర్ రేఖ, నందిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పీహెచ్ఎన్ పద్మావతి అన్నారు.నందిపేట మండల కేంద్రంలో పోషణ అభియాన్ మసోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈసందర్భంగా గర్భిణులకు సీమంతాలు జరిపారు. ఏడో నెల పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమ, భాస్కర్, కార్యదర్శి మహేందర్, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన

రుద్రూర్: పోతంగల్ మండలం జల్లాపల్లి ఫారంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. పౌష్టికాహరం ప్రాముఖ్యతను తల్లులకు వివరించారు. సూపర్‌వైజర్ కొమరమ్మ, అంగన్‌వాడీ టీచర్లు రజీయా బేగం, జయ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



జల్లాపల్లి ఫారం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న టీచర్లు

రేపు డొంకేశ్వర్‌లో మహిళలకు వైద్య శిబిరం

డొంకేశ్వర్(ఆర్మూర్): ఈ నెల 26న ఉదయం 10గంటలకు మండల కేంద్రంలోని పీఎంశ్రీ జెడ్పీ పాఠశాల ఆవరణలో స్వస్థనారీ సషత్ పరివార్ అభియాన్ కార్యక్రమం పేరుతో ఉచిత ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసినట్లు మెడికల్ ఆఫీసర్ శుభాకర్ ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. మహిళల కోసమే ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. గైనకాలజీ, డెంటల్, చర్మ,కంటి, చెవి వ్యాధులకు సంబంధించిన వైద్యులతో పాటు జనరల్ సర్జన్, మెడికల్, పిల్లల డాక్టర్లు కూడా ఈ వైద్య శిబిరానికి వస్తారన్నారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సంక్షిప్తం

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ అన్నారు. ఆర్మూర్ ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజీలో మత్తు పదార్థాలు, గంజాయి నివారణపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కాలేజీ ప్రిన్సిపాల్ విజయలక్ష్మీ, సామాజిక సేవకుడు పట్వారి తులసీ, లక్ష్మణ్, స్వామి పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ల అప్పగింత

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సేకరించి బాధితులకు అందజేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు. ముగ్గురు బాధితులు కల్యాణ్, గజనాంద్, హర్షితకు ఫోన్లను అప్పగించనట్లు తెలిపారు.

పంచాయతీ పాలన అంశాలపై సమీక్ష



బోధన్: సాలూర గ్రామ పంచాయతీ కార్యాలయంలో మండల తహసీల్దార్ ,గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ శశిభూషణ్ ఉద్యోగులతో పాలన అంశాల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామంలో తాగు నీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ, పన్ను వసూళ్ల పురోగతి అంశాల పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జీపీ కార్యదర్శి ప్రవీణ్, జూనియర్ అసిస్టెంట్, బిల్ కలెక్టర్ శిల్ప, సుమలత, ఉద్యోగులు శివరాజ్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీడీసీ నూతన కార్యవర్గం

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ గ్రామాభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మగ్గిడి సూర్య, ఉపాధ్యక్షుడిగా కోయ మహేష్, సమేరా శ్రీనివాస్, కోశాధికారులుగా మిద్దెల హరీష్, బొప్పెన విజయ్, కార్యదర్శులుగా పిట్టల అఖిల్, నడ్కుడ రవి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గసభ్యులు మాట్లాడుతూ అందరి సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

పలు దుకాణాలలో చోరీ

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తా వద్ద ఉన్న వ్యాపార దుకాణాలలో మంగళ వారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. చౌరాస్తాలోని శేఖర్‌రెడ్డి ఆటోమొబైల్స్, బాబా టైల్స్, బెల్ల సాయి శ్రీ దుర్గామెస్, లక్ష్మి నరసింహ ఆర్డర్ మెస్, బుజ్జి హోటళ్లలో దొంగతనం చేశారు. దుకాణాల వెనకాల ఉండే రేకుల నట్‌బోల్టులను తొలగించి షాపులోకి చొరబడ్డారు. వివేకానంద చౌరాస్తాలోని హార్వెస్టర్ల రిపేరు దుకాణం ఎదుట ఉన్న బైక్‌ను ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. దుండగులు ముసుగు వేసుకొని చోరీకి పాల్పడినట్లు ఆయా దుకాణాల వద్ద ఉన్న సీసీపుటేజీలో రికార్డు అయింది.